


# శ్రీ గణేశా! ఈశా!

అసలే పండగపూటా పూజుందన్నా కూడా ఆఫీసుకెడుతున్నారు నాన్నా అని చెప్పి అమ్మ చికాగ్గా వుంది కదా! అందుకని టిఫినన్నా పెట్టకండా వుత్త కాఫీ ఇచ్చిందమ్మా అని పాపం నాన్నకి నీరసంగా వుంది కదా! ఇవేమీ పట్టించుకోకుండా బుజ్జి నాన్న కాళ్లకడ్డం పడి ఒకటే నస.

''నాన్నా! నాన్నా! మరేమోనాన్నా! అమ్మ ఎంత కొట్టినా చిన్నారీ, సుశీలా, ఇందూ పొద్దున్నే లేవలేదు కదానాన్నా. అందరి కన్నా, అమ్మకన్నా కూడా ముందు లేచింది నేనే కదా నాన్నా!'' బుజ్జి అలా చెప్తానే వుంది.

''ఏవిటే దీని గోల! నాన్నా అని పిలుస్తోందని తప్ప ఒక్క ముక్కర్థం కావట్లేదూ!'' నాన్న అమ్మని పిల్చి అడిగారు.

''దానికి చెప్పేందుకూ ఏవీ లేదు. మీరు తీరుపు చెప్పేందుకంతకన్నా ఏవీ లేదు. అందరికన్నా ముందు తలంటోయలేదని ఏడుపు! మీరు తీరగా ఇంటికొచ్చేయండి. పిల్లలన్నాలకి ఆగరు'' అమ్మ చెప్పింది.

''నీ పూజెంతసేపు! మద్రాసు మెయిల్ స్టేషనులో ఎంతసేపాగుతుందో నాకు తెలియదా! ఇలా వెళ్లి అలా వచ్చెయ్యనూ'' అంటూ నాన్న జీపెక్కి వెళ్లిపోయారు.

పొద్దున్న పూటయితే పని తెవల్దని నిన్ననే అమ్మ కుంకుడుకాయలు కొట్టి వుడకపెట్టి వడపోసిన రసం రెడీగా గూట్లో పెట్టుంచింది కదా! అది కాస్త గుండు చెంబులో తీసుకుని వేడ్నీళ్లు పోస్తే బోల్డు కాఫీ నురుగు. అమ్మకన్నీ పన్లూ చేయడం బాగా వచ్చు కాబట్టే మా జుట్టులో ఒక్క పిప్పి కూడా వుండదు. అదే కుసుమా వాళ్లమ్మకయితే ఒక్కపనీ తిన్నగారాదు. పోనీమంటే అమ్మని చూసయినా నేర్చుకోరు. అష్టదరిద్రంగా పొద్దున్నే కూచుని కుంకుడు కాయలు కొట్టుకుంటున్నారు తల్లీ కూతుళ్ళు. మా ఇంట్లో అందరం తలంట్లోసుకోడం, జడలేసుకోడం, పూలు పెట్టుకోడం కూడా అయిపోయింది.

''సుశీలా! అందరూ పట్టు పరికిణీలు కట్టుకోండి. చిన్నారినందరి కాళ్లకీ పసుపు రాయమను!'' అమ్మ చెప్పింది.

ఇంతట్లోకీ చిన్నారి అరుపులు మొదలు పెట్టింది. ''అన్ని పండగలకీ ఒకటే బట్టలా, పట్టువయితే చాలా! వినాయకుడికి కోపంరాదూ?'' అంటూ. ''దేవుడి సంగతెలా వున్నా నాకు మాత్రం కోపం వచ్చేస్తుంది మీరలా పేచీలు పెడితే! తొరగా కానీయండి. వీధిగది కడిగుంచిందిగా మల్లమ్మ. పూజకన్నీ అమర్చండి. సుశీలా! పెత్తనం ఇచ్చాక దాని అందర్నీ బాది చంపకుండా నిమ్మళంగా చేయించు'' అమ్మ వంటింట్లోకెళ్లిపోయింది.

''సరే అమ్మా'' అని పైకంటూ ఒక్కసారి అందర్నీ చూశా! అయింది వీళ్లపని. అమ్మ తర్వాత అమ్మంత దాన్ని నేనే కదామరి. చచ్చినట్లే మొఖాలు నామాట వినాల్సిందే! అసలు ఇందూతో బుజ్జితో ఏ గోలా లేదు. వాళ్లకి పాపం నే ఎంత చెప్తే అంతే. కానీ ఇదుగో ఈ చిన్నారితోనే అసలు గొడవంతా! ఏడాది పెద్దకే నువ్వక్కవయిపోతావా? నే చెల్లెల్నయిపోవాలా అని నన్ను అక్కా అని పిలవనే పిలవదు. వాళ్లిద్దర్నీ అక్కా అని పిలవనివ్వదు. అందుకే పాపం ముగ్గురు చెల్లెళ్లున్నా ఇంతవరకు అక్కనవలేకపోయాను. అందరూ నన్ను సుశీలా అని, నాన్న మాత్రం నానీ అని పిలుస్తారు. పనున్నా లేపోయినా అందరిళ్లకీ పెత్తనాలు చేస్తూ వుంటానని ఇల్లుగల తాతగారు ఇల్లేరమ్మా అని పిలుస్తారు. నాకెంత కోపం వస్తుందో అలా పిలిస్తే! కానీ ఏం చేస్తాం! వచ్చేసిన పేర్లనాపలేం కదా!

నేనేపని చేసినా అలికి ముత్యాల ముగ్గు లెట్టినట్లుందని అమ్మ తెగ మెచ్చుకుంటుంది గానీ అసలా ముగ్గులనేవి పెట్టడవే నాకు రాదు. ఆ ఒక్క పనికీ చిన్నారి మీద ఆధారపడక తప్పదు. అప్పటి వరకూ దాన్నేవీ అనకుండా మంచిగా వుండాలి. ''ఇదుగో చిన్నారీ! ఇటు చూడమ్మా! నాకేమో బోల్డు పనులున్నాయి కదా. అందుకని ముగ్గులపని నువ్వు చెయ్యాలి. ఈ అలమర కింద గోడవారగా పీటలేస్తాం కదా! వినాయకుడి పీట ముందు అష్టదళ పద్మం వెయ్యాలి, పుస్తకాల పీటముందు మారేడు దళం చాల్లే. ఆ రెండు పీటల చుట్టూ మావిడి పిందె ల ముగ్గు పెట్టు. ఈ నాము సుద్ద నీళ్లల్లో ముంచివేస్తే ఆరేటప్పటికి తెల్లగా మెరిసిపోతుంది. చిన్నపిల్లవికదా పాపం పిండితోపోయడం కష్టం'' ఇంకా చాలాసేపు ఓపిగ్గా చెప్పేదాన్నే. ఇంతట్లోకీ చందమామలో భేతాళ కథలు చదువుతున్న చిన్నారి ఆ పుస్తకం నామీద గిరాటెట్టి ''నోరు మూసుకోవే! పెద్ద చెప్పొచ్చావు! తిన్నగా ఒక్క గీత గియ్యడం అన్నారాదు గానీ నామీద క్రపెత్తనానికి సిద్ధం. ముగ్గు వెయ్యమన్నావు అక్కడితో ఆపితే మర్యాదగా వుంటుంది'' అని అంది. అంతా వింటున్న ఇందూ బుజ్జీ కిసుక్కుమన్నారు.

నాకు తల కొట్టేసినట్లయింది. ''అమ్మా! ఇంక నావల్లకాదే! ఈ చిన్నారి నే చెప్పినట్లు వినకుండా ఎక్కిరిస్తోందీ! ఇందూ బుజ్జీ కూడా దానితో కలిసి

పోయారు'' అమ్మకి వినపడేలా ఒక్క కేక పెట్టాను.

''వినకపోతే విశిష్టా పెట్టేయిదాన్ని. నేనొనీ వచ్చా నంటే అందరికీ సమానంగా పడిపోతాయి'' ఆ దెబ్బకి అందరం నోళ్లు మూసుకుని పనిలోపడ్డాం. చిన్నారి వంచిన తలెత్తకుండా పెట్టేసిన ముగ్గులన్నీ ఆరిపోయి తెల్లగా మెరిసిపోతున్నాయి. దేవుడి సామానంతా వీధి గదిలోకి చేర్చేసి పెద్దపీటకి పసుపు రాసి పిండితో కుంకంతో బొట్లు పెట్టాం. పీట మధ్యలో నక్షత్రం ముగ్గు వేయబోయా గానీ అంచులు కలవలా. చిన్నారి కంటపడకుండా వెంటనే బియ్యం పోసేశాను ఆ ముగ్గుమీద. ఆపైన మావిడాకులు పర్చి నలుగురం కలిసి వినాయకుడ్ని జాగర్తగా పట్టుకొచ్చి పెట్టాం. అలమర కొక్కెం నించి తాళ్లు లాగి పాలవెల్లి కట్టి వెలక్కాయలు సీతాఫలాలు మొక్కజొన్న పొత్తులు అన్నీ సరిగా వేలాడేలా పురికోసతో కట్టి అలంకారం చేశాం. ఎవరం ఎన్ని పుస్తకాలు పెట్టుకోవాలో నిన్ననే తేల్చేసుకున్నాం కాబట్టి నేనూ చిన్నారీ ఏడేసి పుస్తకాలు, ఇందువి నాలుగు చందమామలు, ఒక అరటీ ఆవు పుస్తకం, బుజ్జిది పలక అన్నీ ఇంకో పీటమీద సర్దాం.

ఇంతట్లోకీ అమ్మ వచ్చింది చేతిలో వినాయకుడి పుస్తకంతో. ''పసుప్పూసుకున్నారా అందరూనూ'' అంటూ. పూలు పత్రీ నాలుగు వాటాలు వేసి ఎవరివి వాళ్ల ఒళ్లో పెట్టుక్కూచున్నాం దేవుడి ముందు. అమ్మ దీపం వెలిగించేటప్పటికి నిజంగానే వినాయకుడొచ్చేసినట్లనిపించింది.

శ్రద్ధగా కళ్లు మూసుకుని ప్రార్థించడం మొదలెట్టాం. అమ్మ అప్పుడు చూసింది పుస్తకాల పీట కేసి - ''అదేవిటే! తలా ఓ పుస్తకం పెట్టుకొండీ అంటే మొత్తం స్కూలంతా పీటెక్కించేశారు. రేపు బడికెలా వెడతారు?'' అని కేకలేసింది.

''అమ్మా పాపం సుశీలకి భయవే. ఏ పుస్తకం పెట్టుకోపోతే అందులో ఫెయిలయిపోతానని.''

''అలాగా చిన్నారీదేవిగారూ! మరి తమరెందుకు అన్ని పుస్తకాలు పెట్టుకున్నట్లో, మీకసలే వూరు పట్టని తెలివుందిట గదా!'' -నాక్కోపం తెప్పిస్తే నేనూరుకుంటానా!

''వాదించుకోడాలొద్దు. దేవుడి దగ్గిర కూడా ఇద్దరికీ క్షణం పడిచావదు.'' అమ్మకి కోపం వస్తోందని తెలుసుకుని ఇద్దరం మాట్లాడకుండా దేవుడికేసి చూస్తూ కూచున్నాం. నాకయితే వినాయకుడి పీటకన్నా పుస్తకాల పీటే ముద్దొస్తోంది. అన్ని పుస్తకాలూ పీటెక్కితే ఎంత బాగున్నాయో. పాపం వాటికి మాత్రం పండగ కాదూ! ఎంచక్కా మూడురోజులు కదపరట- ప్రమోదక్క చెప్పిందిగా.

అమ్మని మెడ్రాసు మెయిలని నాన్న వూరికే ఎందుకంటారు? గబగబా పూచ్చేసి నైవేద్యం పెట్టి హారతిచ్చేసింది. కథ కూడా చెప్పేసి మా అందరికీ అక్షింతలు వేసి తనుకూడా వేసుకుని నాన్నకోసం గూట్లో పెట్టింది.

''నాన్న రాగానే మర్చిపోకుండా నాలుగక్షింతలు వేయండి పాపం, లేపోతే ఎక్కడో ఏ గోడో బీటలిస్తే పని సరిగా చేయించలేదని నీలాపనిందలొస్తాయి'' అంటూ మా నలుగురికీ నెయ్యేసి రెండేసి వుండ్రాళ్లు పెట్టింది. అంతకన్నా ఎక్కువ మింగితే అన్న వాకలి వేయదుట గదా!



''నానీ! నా వంటయేవరకు దేవుడి పాటలు పాడుకోండి. నాన్న రాగానే అన్నాలు తిందాం. మధ్యలో నన్ను విసిగిస్తే తెలుసూ!''

''అన్నిటికీ నన్నే అంటావేమిటమ్మా! ఈ చిన్నారి సంగతి తెలిసి కూడా!''

''చిన్నారీ! అక్క చెప్పినట్లు వినాలని ఎన్నిసార్లు చెప్పాను?''

''అక్కంటే ఈ పితూరీల పేరమ్మేనా! సర్లే నువ్వెళ్లు. మేం పోట్లాడుకోంలే. ఎవరన్నా వంటింట్లో కొస్తే అడుగు'' మాటిచ్చేసింది. నలుగురం కలిసి ఓ బొజ్జ గణపయ్య, వినాయకుడి కథ జయమంగళం నిత్య శుభమంగళం అన్నీ పాడేశాం.

'' అమ్మా అన్నీ పాడేసుకున్నామే. ఇప్పుడేం చెయ్యాం?''

''ఇంకోసారి మళ్లీ పాడుకోండి. పది నిమిషాలు''- ఇంక నాకు మళ్లీ చిన్నారిని బతిమాలక తప్ప లేదు.

''చిన్నారీ ప్లీజ్! మా అమ్మవిగా ఏదైనా వుపాయం చెయ్యవే. పాడినవే మళ్లీ ఏం పాడుకొంటామే, విసుగొచ్చేలా!''

''మనం స్కూలుప్రేయరు, బాల ఏసు పాటలు పాడుకోవచ్చు. కానీ చర్చిలా వస్తుందీ? బాల ఏసు ఎలా వస్తాడూ? మేరీమాతనెలా తేవాలీ?'' చిన్నారి ఆలోచనలో పడింది. వుపాయం చేస్తే ఎంతసేపు? గుడిని చర్చిగా మార్చడం నిమిషం పని. తెలుగులో గుడి ఇంగ్లీషులో చర్చి అంతేగా.

ఇందూని కొట్టుకు పంపి నాలుగు కొవ్వొత్తులు తెప్పించాం. నూనె తుడిచేసి ఆ కుందుల్లోనే కొవ్వొత్తులు నిలబెట్టాలి. అలమార్లో రాములవారి పక్కన నిలబడ్డ సీతమ్మ వారిని దింపి శుభ్రంగా తడిబట్ట పొడిబట్టతో తుడిచాం. కొబ్బరి నీళ్లు తలా కాసిని తాగి ఆ గిన్నె వినాయకుడి వెనకాల బోర్లించి దాని మీద సీతాదేవిని నించోపెట్టాం. నాన్న పెట్లోంచి తెల్లరుమాలు తీసి ఆవిడ తలమీద వేసి ముందు చేతుల వరకు కప్పేటప్పటికి చక్కగా మేరీమాత ప్రత్యక్షమయింది. పూలన్నీ ఏరేసి పత్రి పైకి లాగి చిందరవందరగా చేసేస్తే పశువుల కొట్టంలా అయిపోయింది. కాకపోతే కాస్త ఏసు బాలుడే బొద్దుగా వున్నాడు. అయినా కొందరు పిల్లలు చిన్నపుడలానే వుంటారు కదా! ''బుజ్జీ! నువ్వా పీటమీద కూచుని నాన్న పెట్టెని రెండు చేతుల్తో ఇలా ఇలా అనాలన్న మాట. నువ్వు పియానో స్విస్టరువి గదా. మధ్యలో అమ్మ అనకూడదు.''

మిగిలిన ముగ్గురం కళ్లు మూస్తూ తెరుస్తూ ప్రార్థన మొదలెట్టాం- ''ఓ పరలోకమందున్న మా తండ్రీ, మీ నామము పూజింపబడుగాక. మీ రాజ్యము మీకు వచ్చుగాక.... నేడు మా అను దినాహారము మాకు దయచేయుము... '' ప్రేయరవగానే పాటలు మొదలెట్టాం.

''అభయ మభయ మభయ మెప్పుడానంద మానంద మానందమౌగా! దేవుడే నాకాశ్రయంబు, దివ్యమయిన దూరమూ'' ఇంకోపాట ''రాజాధి రాజా రావే! రావికోటి తేజ ఏసురావే! రాజులకు రాజువై రావే!...'' అమ్మొస్తోంది పాట మార్చేయండే బాబూ! నేను ఖంగారు పడిపోతున్నా.

''స్కూలు పాటలు పాడుకుంటున్నారే! బుజ్జి తల్లులూ! మీ చర్చెంత బాగుందే! ఇంక పాడినవి చాలు గానీ ఇల్లంతా సర్ది తుడిచి కంచాలు పెట్టేయండి. నాన్నొస్తే అన్నాలు తిందాం.'' రాజాధి రాజా పాడుకుంటూ అమ్మ వంటిట్లోకెళ్లిపోయింది.

''అమ్మయ్య. బతికాంరా జీవా! ఏమంటుందోనని హడలి చచ్చాం.''

ఇంతట్లోకీ వాకిట్లో జీపాగిన చప్పుడు. ఇందొక్క కేక పెట్టింది.

''అమ్మా! ఇంక మనం అనుదినాహారం తినొచ్చే! పరలోకం నించి నాన్నొచ్చేశారు!''

**-సోమరాజు సుశీల**